సంతలో గాజులు కొనడానికి వచ్చాడు కుర్మాన్. మనస్సు బొత్తిగా బాగాలేదు. ఒళ్ళంతా నెప్పులు, కుళ్ళబొడిచేసినట్టుంది. అయినాసరే ఈ దుకాణమనీ ఆ దుకాణమనీ అన్నీ తిరిగి చూస్తున్నాడు. బంగారం రంగువి కొనాలా, వంగ పండు రంగువి కొనాలా ? ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు.

ఇదివరలో సంతకి వస్తే హుక్కా, తంబాకూకోసం వచ్చేవాడు. మిరపకాయలూ, ఉల్లిపాయలూ కొనేవాడు. చిన్న చిన్న ఉప్పుచేపలు కొనేవాడు. ఇవాళ మాత్రం గాజులు కొనవలసొచ్చింది. జడకి కట్టుకునే రిబ్బన్ కూడా కొనాలి.

# ధర్మసంకటం

బెంగాలీ మూలం – అచింత్యకుమార సేనగుప్త
అనువాదం – సూరంపూడి సీతారాము

గాజుల కొలత మూడుంబావు వేళ్ళ వలయం. గాజులు తీసి తన వేళ్ళతో కొలుస్తున్నాడు, సరిపోతాయా, లేదా అని. కొలత కుదిరితే రంగు బాగుండదు, రంగు బాగుంటే కొలతకుదరదు.

ఇవాళ నూర్‌బాను చేతిగాజులు పగలగొట్టి వచ్చాడు. రిబ్బన్ పట్టుకుని గుంజేసరికి జడ విడిపోయింది. చేతులు కొంచెం గీరుకుపోయుంటాయి కూడా.

ఇల్లూ పొలం లేవు. వన్నూ పంటా లేవు. కౌలుకి పొలం తీసుకుని దున్నుకుంటున్నాడు కుర్మాన్. దున్నుకోడాని క్కూడా నాగలీ అదీ తెచ్చుకోవలసిందే. కిందటి ఫసలీకి ఏకాస్త గింజ పండిందో. అదికాస్తా పిట్టలు తినేశాయి. ఎలకలు తినేశాయి. ఈ యేడు మొక్క యేపుగా పెరిగిందిగాని ఇంకా కంకులు పాలు పట్టలేదు. ముంపు నేల. చవుడు విరగడం లేదు ఓపట్టాన. ఏమాత్రం వస్తుందో ధాన్యం. నేలగికి తీస్తే. మొత్తం అంతా మునీబు (యజమాని)గారి గాదెలో పోసెయ్యవలసిందే. ఆ కాస్తలోనూ ఒక వంతు తనకి వస్తుంది.

అతి దరిద్రం అనుభవిస్తున్నాడు. కుర్మాన్ ఒక్కడూపడే పాటుతో జరుగుబాటు సాగదు. నూర్‌బానుకూడా పాటు చెయ్యక తప్పదు.

మునీబుగారింట్లో వడ్లు దంపుతుంది నూర్‌బాను. జనుముతాళ్ళు పేనుతుంది. బట్టలు పిడిచి ఆరేస్తుంది. నీళ్ళు తోడుతుంది. మునీబు భార్యకి సేవ చేస్తుంది. ఆమెకు తల దువ్వుతుంది. ఒళ్ళు పట్టుతుంది. నూని మర్దనా చేస్తుంది. అప్పుడప్పుడూ కాస్తకాస్త తినడానికి దొరుకుతుంది. నెలకి నాలుగు రూపాయలు ఇస్తారు.

కాని సుఖం లేదు. మునీబు ఉకిలద్దీ దఫాదార్ (వకీలుద్దీన్‌కి తూర్పుబెంగాల్‌లో వాడేమాట ఉకిలద్దీ.) దుష్టకన్ను ఆమె మీద పడింది.

మొదటిరోజే మొరపెట్టుకుంది నూర్‌బాను : "మునీబు నావొంక దుష్టుసూపు సూత్తన్నాడు" అని.

"ఏం? ఏం సేత్తన్నాడేటి?"

"ఖుక్ ఖుక్ అంటూ దొంగదగ్గు దగ్గుతాడు. నాకేసి హొంకరసూపు సూత్తాడు. ఖుసీ ఖుసీగా నాతో పరాసికా లాడతానంటాడు."

"అడి దరిదాపులికి పోమాక. నువ్వెప్పుడూ."

"నేదు నేదు. నేను తలమీద ముసుగు మొకం మీదికి లాక్కుని దూరంగా తప్పుకుంతానే వున్నాను."

అయినా దఫాదార్ వూరుకోడు. ఒకరోజు ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

ఆ రోజు ఏడుస్తూవచ్చి చెప్పింది నూర్‌బాను : "చెయ్యొదిలించుకోబోతే గిల్లేసి





నాడు" అని.

కుర్మాన్‌కి కోపం వొచ్చేసింది. ముఖం కందగడ్డలా అయిపోయింది; "నువ్వసలాడి ముందుకెందు కెల్లినావ్?" అని కంయి మన్నాడు.

"ఎవురు సెప్పారు? ఆడిముందుకి నేనెల్లందే అసలు?"

"ఎల్లకపోతే సెయ్యేలాగట్టుకున్నాదే?"

"నేనేమో దంపుల్ల గదిలోనే వున్నాను. ఆడక్కడకొచ్చాడు- ఇత్తనాలు (వరివిత్తనాల వొడ్లు) ఏ పాటున్నాయే — అంటూ అడిగాడు. నేనింకో గుమ్మంలోంచి పారి పోతన్నాను. అంతలోకే దబ్బునొచ్చిసి సెయ్యట్టుకున్నాడు."

ఆ రోజుని కూడా ఆమెని కొట్టలేదు కుర్మాన్. తన తలరాత అల్లా వుందనుకుని నెత్తి మొత్తుకున్నాడు.

ఇదేం అన్యాయం? పేదవాడయితే పెళ్ళాం అందంగా వుండకూడదా? పేదవాడయితే ఇంక పెళ్ళాంతో సుఖపడ్డానికి లేదా?

"ఖబర్దార్! ఆడెదుటికి పోవొద్దని మల్లీ సెపతన్నాను. డబ్బూ బలగంవున్న మడిసి ఆడు. పోలీసులూ టానాలూ అన్నీ ఆళ్ళ సెప్పుసేతల్లో వుంటయ్. ఆల్లకిదూరంగా తప్పుకుని తిరగాల మనం. నీవనేదో నువ్వు సెకసెకాసే సేసుకుని ఎంచెంటనే వొచ్చెయ్యి."

కాని ఇవాళ చూస్తే, ఆమె చేతుల నిండా గాజులు, జుట్టుముడి చుట్టూ రిబ్బన్.

విరగబడి నవ్వేస్తోంది నూర్‌బాను. కుర్మాన్ ముఖవైఖరి చూసి తమాయించుకుంది.

"ఇయ్యన్నీ యెక్కడియ్యే నీకు?"

"అమ్మగా రిచ్చినారు."

అయితే? డబ్బెవరిది? ఈ సింగారానికి వెనక చాటున ముదలకింపు ఎవరిది? ఇవాళ చేతిగాజు లయింది, రేపు ఉంగరం, మరోటీ. చవుడునేలని యిల్లాగే చవుడు విరిచి తీసి సారం పెంచడం.ఇవాళ చెయ్యట్టుకున్నాడు, రేపు వాటేసుకుంటాడు.

"తియ్ తీసెయ్" అని గర్జించాడు కుర్మాన్.

అలంకారం అంటే ప్రీతి నూర్‌బాన్‌కి. కొంచెం వెనుకాడుతోంది. కుర్మాన్ ఆమె చేతులందుకుని గుంజేశాడు. గాజులు పటపటమని బద్దలైపోయాయి. కొప్పట్టుకుని గుంజేశాడు. ముడుచుకున్న నల్లతాచు చర్రున ఇంతపొడుగు లేచినట్టు విడివడింది జడ.

ఎక్కి-యెక్కి ఏడ్చింది నూర్‌బాను. గాజుముక్కలు గుచ్చుకుని చేతులు అక్కడక్కడ చీరుకుపోయాయి. చర్మం చీరుకుపోయి నెత్తురు చారలు పడ్డాయి.

మగని ముఖంలో అంత ప్రచండ కోపం యెన్నడూ చూడలేదామె. భయపడి పోయిందు. గాజులూ, గీజులూ వేసుకోవలసిన అవసరంలేదు.తను పేదవాడైతు పెళ్ళాం. రాయిలా పడివుండాలి. సరదాలూ, అలంకారాలతో పనిలేదు.

కాని యిదేమిటి! సంతసించి యివాళ తన కోసం గాజులు తెచ్చిచ్చాడు కుర్మాన్? మిరపకాయలూ ఉల్లిపాయలూ తేలేదు. తంబాకు తెచ్చుకోలేదు. సిగ్గుతో ఒళ్ళు చచ్చిపోయింది ఆమెకి.

ఆమె చెయ్యి అందుకుని అయిదువేళ్ళూ చాచి పట్టుకుని స్వయంగా గాజులు తొడిగాడు కుర్మాన్. మెల్లి మెల్లిగా, చేతులెక్కడ కందిపోతాయో నన్నట్టు జాగ్రత్తగా మెత్తగా తొడిగాడు. ఆ చేతులు చూసేసరికి అతనికి బుర్ర వేడెక్కిపోయింది. ఇంత చక్కని చేతులు! ఈమెని కొట్టడానికి తనకి చేతులెల్లా వొచ్చాయి?

"ఊరికే లేనిపోని కరుసెందుకు సేస్తావ్?" అంది నూర్‌బాను. "నీకేమో




ఓ కండవా నేదు. లుంగీ సిరిగి తూట్లడిపోనాది."

"సిరిగిపోతే పోనియ్యేస్. ఒక్కపాలి నావొంక సూసి ఒక్క నవ్వు నవ్వే" అన్నాడు.

ఆమె వీపుపైన జుట్టు జీరాడుతోంది: "నువ్వు జుట్టు కట్టుకోంగా సూశ్నేదే నేనీ మద్దెని" అన్నాడు.

జుట్టు కట్టుకోడమే కాదు. చెవులారా విన్నాడు కుర్మాన్ గాజుల గలగలలు.

పోనీ అంటే. పనికి వెళ్ళడం మానేసిందా? లేదు. నాలుగు రూపాయలు తక్కువ సొమ్మా? ఓ పూట తిండి చేదా? కాలదన్నుకోడానికి లేదు.

కాని ఆ రోజు నూర్‌బాను మునీబు యింటినించి కొత్తచీర కట్టుకుని మరీ వచ్చింది. తెల్ల దోరియాల చీర. ఆమె వొంటి పసిమిఛాయ వొక్కసారి వెలిగినట్టుంది.

"ఈ పీరె క్కడి దే మల్లీ?" అతని కళ్ళల్లో శూలాలు!

"ఇయ్యేల ఈద్. గేపకంలేదేటీ నీకు? ఈద్ పండక్కని కొత్త సీరెట్టింది అమ్మగారు."

ఈద్ అయితే ఆయింది. కుర్మాన్ చల్లబడలేదు. ఈద్ అయితే తనకి సేమియా ఏదీ? పాయసం ఏదీ? ఒక్క బొట్టు ఎరగడు గదా! తనకొక్క కొత్త కండువా లేదు. లుంగీ లేదు. మరి ఈద్ ఎక్కడుంది?

కుర్మాన్ చల్లబడలేదు. ఆ చీర ప్రతి నూలుపోగులోనూ ఉకిలద్దీ మత్తు చూపులు కనపడుతున్నాయి. మూతి నాకుంటున్న లోభం కనబడుతోంది. పరపరా చింపి తుంపులు చేసేశాడు చీర పట్టుకుని.

ఈమాటు సంతకెళ్ళి మరోచీర తీసుకురాలేదు. డబ్బులేదు. మనసూ లేదు. పేద రైతు. తన పెళ్ళానికి దొరసానిలా అలంకరించుకోవాలని ఈ సరదా లేమిటి? ఓ నారతుండు చుట్టుకుని ఇంట్లో ఓమూల పడి వుండక?

నిజం. ఇంత సింగారం తనకి నప్పదని తెలిసిపోయింది ఆమెకి. ఆ చీర కట్టుకున్నప్పుడు తెలుసునా ఆమెకి?— ఆ చీర కుచ్చిళ్ళలో సర్పం దాగివుందని? మెల్లిమెల్లిగా అది ఒంటిపైకి పాకుతూపోయి గుండెల మీద కాటువేస్తుందని? ఇంకమరి నూర్‌బాను తన వల్లపూల అద్దకం నల్లచీర తీసి కట్టుకుంది. రాత్రివేళ ఒంటరితనపు నిస్తబ్ద వాతావరణంలా వుంది చీర. నిద్ర మైకంలో మళ్ళీ పతిస్పర్శలో ఒదిగిపోయింది. తెల్ల దోరియాల చీర చిరిగిపోయిందనే చింత మరిగిపోయింది. పని మానిపించేశాడు ఆమె చేత. పర్దాలోపల బిగించాడామెను. ఉపవాసాలుచేసి మగ్గిపోయినా పరవాలేదు కాని. పాపానికి దూరంగా వుండవచ్చు. శరీరం దారిద్ర్యంలో కుములిపోనీ. అధర్మం అంటకుండా వుంటే చాలు. దుర్దినాలు వొచ్చినా మానుషం పోరాదు.

కాని ఉకిలద్దీ దఫాదార్ జలగలాటివాడు. పట్టుకుంటే వొదలడు. వయసు ముదిరిపోయినా బుద్ధి మాత్రం రాలేదు.

ధాన్యం కోతలకి పొలానికి వెళ్ళాడు కుర్మాన్. కోతల రోజులు. అడుగులో అడుగు వేసుకుంటూ చల్లగా మధ్యాహ్నం వేళ ఇంటికే వచ్చి హాజరయ్యాడు దఫాదార్. చెవులకి ఝుమ్కీలు. పాదాలకి పట్టాలు. మెడలో మల్లిదండ— వెండివి చేయించి తెచ్చాడు. "ఎక్కడుందోయ్ బీబీజాన్! చూడండి వొచ్చి ఏం తెచ్చానో" అంటూ పిలిచాడు మెల్లిగా.

వచ్చి సూటిగా చూపు సారించింది అతనికేసి నూర్‌బాను. వెండి నగలమీద లేదామె చూపు. పులిని చూసిన చూపు అది.

విపరీతంగా భయం వేసింది ఆమెకి. అతను పొలం యజమాని. ఆపైన తను చాకిరి చేసిన ఇంటి యజమాని. ఆమీద దఫాదార్ [కూలీలమీద పెత్తనం చేసే ఉద్యోగి దఫాదార్.] ఇది చాలక మాంసం రుచిచూసిన క్రూర మృగం!

"యెల్లిపొండి మీరిక్కణ్నించి" అతి తగ్గుస్థాయిలో పట్టేసిన గొంతుతో గద్దించింది. కళ్ళల్లో. ముఖంలో రోషం.

"నీ కోసం లబీజాన్ అయిపోయొచ్చాను యిగో చూడండి నగలు చేయించి తెచ్చాను. మీ కోసం" [ప్రాణాలు కడంటిన స్థితిలో మనిషిని లబీజాన్ అంటారు.]

"అక్కర్లేదు. ఎల్లిపొండి మీరు. లేపోతే అరిసి అల్లరి సేసేత్తా నిప్పుడే."

కాని అల్లరి చెయ్యడానికి ముందే వచ్చిపడ్డాడు కుర్మాన్. ఎండలో కాలి నల్లగా మాడిపోయొచ్చాడు. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయా? లేకపోతే తన యింటి ముంగిట్లో ఏమిటిది? దఫాదార్ చేతిలో వెండినగలు! నూర్‌బాను కళ్ళలో సంతోషం చిందులు తొక్కుతోందా? లేకపోతే— అందులో నటనా.నాటకం యెంతున్నాయి? వేళాకోళం అవహేళనా ఎంతవరకున్నాయి? ఈ నగల వెనక చాటుమాటు వ్యవహారం. కుట్రా మోసం ఎంతమటుకున్నాయి?

నెత్తురు తల కెక్కిపోయింది కుర్మాన్‌కి. దీనంగా నిస్సహాయంగా చూశాడు నలుపక్కలా. అక్కడ ధాన్యం పనలు కోసినచోట కళ్ళంలోనే పడేసి వచ్చాడు కొడవలి.


"ఇక్కడి కెందుకొచ్చారు?"

ఉకిలద్దీకి మాటలు తడబడ్డాయి. ఎల్లాగో సంబాళించుకుని అన్నాడు "ధాన్యం కోతలకి నువ్వెళ్ళావో.లేదో చూడాలనొచ్చాను."

"అయితే పొలానికి రావాలగాని ఇంటి కెందుకు?"

"నా యిష్టం- ఈ జాగా జమీనూ. లోపలా బయటా అన్నీ నావి. నా యిష్టం వొచ్చినట్టు వస్తాను. పోతాను."

కుర్మాన్ హఠాత్తుగావెళ్ళి ఉకిలద్దీ గడ్డం అంది పుచ్చుకున్నాడు. లాగులాట. కొట్లాట ఆరంభమైనాయి. కాని ఉకిలద్దీ చేతిలో లాఠీ ఉన్నది గమనించలేదు కుర్మాన్. పైగా ఎప్పుడూ అర్ధాకలి తిండితో పగలంతా వెన్ను విరుచుకుని పనిచేసే కుర్మాన్‌కి, ఒంట్లో సత్తాజోరూ తక్కువ. ఆపైన ఒళ్ళు తెలియనికోపం. ఉకిలద్దీ అతన్ని ఒక్క దెబ్బతో గెంటిపారేశాడు. గెంటేసి చేతిలో లాఠీ యెత్తి వెయ్యబోయాడు.




కుర్మాన్ రావడం చూసీచూడగానే లోపలికి వెళ్ళిపోయింది నూర్‌బాను. లాఠీయెత్తి కొట్టబోవడం చూసేసరికి ఇంక వుండలేకపోయింది. దేగలా వచ్చి వాలింది ఉకిలద్దీ మీదికి. అతడి చేతిలో లాఠీ పట్టుకుని లాక్కోవాలని ప్రయత్నించింది. కాని అతడి పిఢికిలి పట్టునించి వొదిలించలేకపోయింది. మళ్ళీ పెనుగులాట ఆరంభమయింది.

కుర్మాన్‌కి తన కళ్ళెదుట చూస్తున్నదేమిటో బోధపడలేదు. బుర్రలో రేగిన తుపానువల్ల జ్ఞానం నశించింది. ఒక్క ఉదుటున లేచి ఆమె కొప్పు అందుకున్నాడు. "నువ్-నువ్ పరదా దాటి బైటికెందుకొచ్చినావే. పరాయి మొగోడితో సిగపట్లు నీకేంఛే?" అంటూ అరుస్తూ ఉకిలద్దీని విడిచిపెట్టి ఆమెని కొట్టడం ఆరంభించాడు. అల్లా ఆమెని కొట్టాడో, లేదో - ఇంతలో ఇద్దరి పట్టూ వొదిలేసిన అదునుచూసి ఉకిలద్దీ చేతిలో లాఠీ యెత్తి కుర్మాన్ నెత్తిమీద ఒక్కటి పెట్టాడు. ఆమే లాఠీ పుచ్చుకుని కొట్టిందా అనుకున్నాడు! తను ఉకిలద్దీని చావగొట్టనియ్యకుండాఅతన్ని కాపాడ్డం కోసమే ఆమె ఇవతలకొచ్చి పెనుగులాటలో మధ్యకొచ్చి పడిందనుకున్నాడు. వాడంటే దీనికింత మోజు కాబట్టే దీనికి నగలూ, అలంకారాల పిచ్చి, అని తోచింది.

కుర్మాన్ వెర్రికోపంలో అరిచేశాడు "ఏక్ తలాక్, దో తలాక్, తీన్‌తలాక్-ఫో బైటికి."

బస్! అల్లరంతా వొక్కసారి అణిగిపోయింది. అంతటా నిశ్శబ్దం. అంతా అఖరై పోయింది!

కోపం మరిచిపోయాడు. తలమీదచేతులు పెట్టుకుని కూలబడి పోయాడు కుర్మాన్. వందలాఠీ దెబ్బలు పడ్డా,ఇంత దెబ్బ తగల్లు. అతనికి నలుపక్కలా చీకట్లు కమ్మినట్టయింది.

కోపంతో ఎర్రబడిపోయి రక్తం చిందుతున్న ఆమె ముఖం అకస్మాత్తుగా తెల్లగా పాలిపోయింది. హఠాత్తుగా దివాలా తీసేసిన మనిషిలా కళ్ళు వెపవెప లాడిస్తూ అట్టే చూస్తూ ఉండిపోయింది నూర్‌బాను. ఉకిలద్దీ కిందపడ్డ లాఠీతీసి అందుకుని మహా సంతోషంతో పగలబడి నవ్వేస్తున్నాడు. జనం పోగవుతున్నారు మెల్లి మెల్లిగా.

కుర్మాన్ ఒళ్ళు దులుపుకుని లేచాడు. "ఏం గాలేదులే ఫో నువ్వింట్లోకి"అన్నాడు నూర్‌బానుతో.

నిజంగానే ఏమీ జరగనట్టే మంచి ఇల్లాలు మోస్తరుగా, తలపై కొంగు ముఖం మీదికి లాక్కుని నూర్‌బాను యింటిలోకి మెల్లిగా నడిచిపోయింది.

ఏం జరగలేదనడం ఎల్లాగ? అంటే అయిపోతుందా? మెల్లిగా చేరారు మధ్యవర్తులు పదిమందీ. తలాక్ ఇచ్చాక ఆడది పరాయి ఆడదే అయిపోతుంది. ఆమెపైన ఆ భర్తకింక ఎలాటి అధికారమూ, హక్కూ ఉండవు. ఒక్కమాటలో చెప్పాలంటే- రోజూలాగా ఆమెనింక తన ఇంట్లో పెట్టుకోడానికి వీల్లేదు. పెళ్ళి కాస్తా విచ్ఛేదమైపోయింది! తిరిగి ఆమెని పొందడానికి వీల్లేదు. ఏమీ జరగనట్టు'నా పెళ్ళాం'అంటూ ఆమెని తీసుకుపోడానికి వల్లకాదు. ఇటువంటి హరామీని (అపవిత్రతని, అధర్మాన్ని) సమాజం సహించదు.

ఉకిలద్దీ పళ్ళన్నీ వెళ్ళబెట్టి తెగ నవ్వుతున్నాడు. "ఎర్రికోపంలో చట్టు నొచ్చేసినయ్ నోటంట మాటలు. అంతలోకే నా పెళ్లాం పరాయిదై పోద్దేంటి?" అన్నాడు కుర్మాన్ ఏదేస్తూ.

పరాయిదంటే పరాయిదే! గుమ్మానికి ఇటునించి అటు ఒకసారి వివాహ బంధం తెగిపోయినట్టు ఫారఖత్ జారీ చేశాక, మరింక ఉపాయంలేదు. గాలిపడగ దారం తెగిపోయాక, దారపుటుండ చుట్టుకుంటూపోతే అది మళ్ళీ వెనక్కి వొస్తుందా?

"నోటంటొచ్చిన మాటే యెక్కువా? మనసులో సంగతి సూడక్కల్లేదా యెవురూ?" అన్నాడు.

కాని నోటిమాటకి విలువ తక్కువా! వేళాకోళానికి అన్నా తలాక్ తలాకే. పైగా యెంతకోపం వొచ్చేసినప్పుడన్న మాట! గొంతు చించుకుని, పట్టపగలు వీధి గుమ్మంలో అరిచి చెప్పినమాట, తలాక్ ఇచ్చేసిన మాట.

"పెద్ద సాక్షుల యెదటే చెప్పిన తలాక్ మరి" అంటూ మరింత ఎగసంతోశాడు ఉకిలద్దీ.

"మరి నాకు దారేలేదా? నూర్‌బానూ మరి నాకు దక్కదా?"

ఒక ఉపాయం వుంది. ఆలోచించడానికి కూచున్నారు పెద్దలు పదిమందీ. ఆలోచించి ఫర్మాన్ ఇస్తారు. ఇద్దత్ గడిచాక (విడాకులిచ్చాక పునర్వివాహానికి ముందు ఆగవలసిన సమయం— మూడు మాసాలు, అంటే తలాక్ యిచ్చిన భర్తవల్ల సంతానం గర్భస్థంగా ఉన్నదేమోననే అనుమానం తీరేదాకా) మరెవరేనా నూర్‌బానుని పెళ్ళి చేసుకుని వెంటనే తలాక్ యిచ్చేస్తే. అప్పుడు మళ్ళీ కుర్మాన్ ఆమెని నిక్కా చేసుకోవచ్చు. ఇది తప్ప మరో ఉపాయం లేదు.

అల్లా ఎవరు చేసుకుంటారు, ఒక్కరోజు కాపరానికి పెళ్ళి? ఆమెని మళ్ళీ కుర్మాన్‌కే అప్పగించే ఉదేశంతో పెళ్ళి చేసుకుని విడిచి పెట్టే వాళ్ళెవరుంటారు?

మరెవ్వరు? దాడీ చల్లగా సవరించుకుంటూ ఉలకిద్దీ అన్నాడు. "నేను చేసుకుంటా."

అయితే, పెళ్ళిచేసుకునీ చేసుకున్న మరుక్షణమే తలాక్ ఇచ్చెయ్యాలి మరి. ఆ తరవాత మాట తిరిగిపోతే కుదర్దుమరి. పదిమంది మధ్యవర్తులు, పెద్దలు చేస్తున్న హుకుమ్ పాటించాలి. వీళ్ళలో కాజీల్సు, ఇమాముల్సు,ముల్లాలు,మున్షీలు, యూనియన్ బోర్డు ప్రెసిడెంటు - ఇలాటి పెద్దలున్నారు. వీళ్ళందరిమాటా కొట్టిపారెయ్యడానికి లేదు.

కొంచెం ధైర్యం చిక్కింది కుర్మాన్‌కి. కానీ తన యింట్లో యింక నూర్‌బానూ వుండటానికి వీల్లేదు! మంచి వయసులో వున్న పడుచు పరపురుషుడి ఇంట్లో ఎలా వుంటుంది! పక్కపల్లెలో ఆమె పినతండ్రి

ఒక డున్నాడు. అతని కెవ్వరూలేరు. అక్కడికి వెళ్ళి వుంటుంది- ఇద్దత్ మూడు మాసాలూ.

కట్టు బట్టలతో వోరువోరున రాగాలు పెడుతూ వెళ్ళిపోయింది పాపం నూర్‌బాను- మొగుణ్ణి అప్పుడే గోరీలో దింపేసి పైన మట్టి పోసి కప్పేసి వెళ్ళిపోతున్నట్టు.

ఇంక వేరేముంది? నూర్‌బాను కుర్మాన్‌కి చెయ్యిదాటిపోయింది. చెయి జాపి పట్టుకుని అట్టేపెట్టుకోలేకపోయాడు.

మామూలు మాటలు ఏవో రెండు తొందరపాటులో నోటంట వచ్చాయని. ఇలాగ ఇంత అధోగతిపాలై పోతాడని యెవరనుకున్నారు? అతనికోషం అతన్నే కబళించివేస్తున్నట్టయింది. వరండాదిగి దక్షిణంగా నడిచిపోయాడు. నూర్‌బాను లేకపోయాక తనకీ యిల్లేవిటి, గుమ్మాలేమిటి? ఇంటిముందర దడి కిందనించి చెదలు తినేసి ఒరిగిపోతోంది. అదే మోస్తరు అతని హృదయ పంజరంకూడా శిథిలమైపోతోంది. దక్షిణదిక్కుగా నడిచిపోతున్నాడేకాని అతని మనస్సు ఆమె వెళ్ళిన ఉత్తరం దిక్కుకే గాలి తరగల్లో తేలిపోతోంది.

ధాన్యం కోతలు పూర్తయినాయి. సొంత వూరు వెళ్ళిపోయాడు కుర్మాన్. గ్రామం స్థితీ, తనస్థితీ ఒక్కలాగే ఉన్నాయి. తలుపులు బార్లా తెరిచి వున్నాయి. ఎక్కడ నూర్‌బాను? చైత్రకాలపు పొలంలా గుండెల్లో గుబులు. కాని ఒకరోజు బాగా రాత్రివేళ చాటుమాటున ఇంటి కొచ్చింది నూర్‌బాను. ఎంతో అన్యాయం జరిగిపోయిన దెబ్బ ఆమె ముఖంలో కనబడుతోంది. కుర్మాన్‌కి బాగా దూరంలో ఒదిగి కూచుని, చెంగుతో కళ్ళద్దుకుంటూ లోలోపల ఏడవసాగింది.

అమాంతం వెళ్ళి ఆమెని వాటేసుకోవాలనిపించింది కుర్మాన్‌కి. ఒళ్ళోకి లాక్కుని కళ్ళు తుడిచి అనునయించాలనుంది.

వొద్దువొద్దు, అంది నూర్‌బాను. "ఇంకా హలాల్ నెరవేరలేము (ఇస్లాం ధర్మం శాసించిన విధివిధానం హలాల్. వాడుకలో పశు వధకోసం పాటించవలసిన విధిని హలాల్ అని వ్యవహరిస్తారు కూడా). ఇద్దత్ ఇంకా పూర్తికానేదు. ఇంకో నిక్కా కానేదు, తలాక్ కానేదు." అని వారించింది. "నిన్నోపాలి సూడాలనిపించింది, వొచ్చాను. మనసెల్లాగో వున్నాది" అంది.

బొత్తిగా చిక్కి సగమైపోయింది నూర్‌బాను. ముఖం మాడిపోయింది. ఒంటిచాయ రాగిరంగుకి తిరిగింది. ఒంటిలో బొత్తిగా జవసత్వాలు వుడిగిపోయాయి. ఇంట్లో వొకసారి, అవీ యివీ సామాన్లు చూసుకుంది, అటూ యిటూ ఏవో సర్దింది. ఇంట్లో కాస్సేపు అటూ, యిటూ తిరుగాడింది.

"నువ్వునాకు మళ్లీ దక్కుతావంటే నూర్?"

"తప్పకండా. పదిమంది పెద్దోళ్ళముందు సేసిన తీర్మానం. తిట్టి కొట్టి మాట నిలబెట్టిత్తారు. కల్లు మూసుకోని సెర్లో సేపలా ఈ కసిన్ని రోజులూ ఎల్లా గోలా గడిపెయ్యాల."

"నా కేమనిపిస్తందో తెల్సా? ఆడు నిన్నింకొదిలిబెట్టడు. ఒక్కపాలి కల్మా సదివాడంటేసాలు, నోరు కుట్టేసుకూక్కుంటాడు. తలాక్ ఇవ్వను పో, అంటాడు."

"ఇస్! అల్లాగేం" అంటూ నూర్‌బాను పడగెత్తిన పాములా బుస్సుమంది. "పదిమంది పెద్దలూ ఆణ్నెందు కొదిలిపెడతారంట?"

"ఆల్లొదిలి పెట్టకుంటే మాత్తరమేందిలే! ఆడు నిన్ను కాపరం పెట్టేసుకుంటాడు. ఆడితో అదాలత్‌లో దెబ్బలాడ్డానికేనా వుండదు.— ఎవరేటి, నాసేత బలవంతాన తలాక్ ఇప్పించే మొగోడు అని సవాల్ సేత్తాడు."

"ఇస్! అల్లాసేత్తాడేం? సూద్దారి ఆడి బేయీమానీ" మళ్ళీ బుసకొట్టింది నూర్‌బాను. "ఆ వసువు తక్కువోణ్ణి ఇసమెట్టి సఫా సేసేత్తాను. ఆడి ఆస్తిలో వాటా తెచ్చుకొనొచ్చి నిన్ను పెళ్ళి సేసుకుంతాను."

## అవతలి పార్టీ

ఇ వేమిటీ వింత భయాలు?  
— పదవికి ముప్పు!  
ఇవేమిటీ అపస్వరాలు?  
— పార్టీ ఫిరాయింపు!



అవేమిటి రంగుల నీడలు?  
— (అ) రాజకీయాలు!  
ఎచటికి పోతావీ రాత్రి?  
—అవతలి పార్టీలోకి!

(శ్రీశ్రీగారికి క్షమాపణలతో)

—అండా రామారావు

నూర్‌బాను కళ్ళల్లో ఎంత ప్రేమ! ఎంత విశ్వాసం!

"ఒల్లేటో తూట్లు పొడిసేసి నట్టుండాదే. జొరం సోకి నట్టున్నాది" అన్నాడు కుర్మాన్.

ఒళ్ళు అంటి వెష్టచూడబోయింది నూర్‌బాను. చటుక్కున చెయ్యి పట్టుకున్నాడు. అయ్యో! ఈ పసిడి రంగు చేతిని తన చేతిలోకి తీసుకునేహక్కు లేదుగదా తనకిప్పుడు, అని దుఃఖించాడు.

ఒక్కో రోజు అర్థరాత్రి వేళ ఆమె యింటికెళ్ళి గుమ్మంలో నుంచునేవాడు కుర్మాన్. ఆమె కంటికి నిద్ర కరువయింది. దడి అవతల సందులో నించి చూస్తూ, కూచుండిపోతుంది.

"పిచ్చోడిలా అల్లాతిరుగుతావేటి సెప్పు? లోకులు నిన్ను దొంగంటారు. చౌకీదారు సూత్తె చలాన్ సేత్తాడు."

"మరెప్పుడే నివ్వొచ్చేదీ?"

"దఫాదార్ తన మడుసుల్ని తీసుకోని ఒచ్చినాడు. వొచ్చే జుమ్మా రోజుని (జుమ్మా అంటే సమూహ ప్రార్థనచేసేరోజు, శుక్రవారం) కల్మా సదువుతాడంట. ఆ తరవాత తలాక్ ఇప్పించుకుంతాలే. ఇప్పుడింక ఇంటికెల్లు."

ఇల్లెక్కడ! పిట్టనొక్కసారి గుండెల కదుముకుని పక్షిలా ఎక్కడికేనా ఎగిరిపోతే బాగుండుననిపిస్తుంది. ఎక్కడికో, ఎవ్వరూ తెలీనిచోటికి. ఇటువంటి పేచీ పూచీలు లేని చోటికి, ఎక్కడ భూమీ ఆకాశం విశాలంగా వ్యాపించి కంటికి కనపడతాయో, అక్కడికి.

అవును తొరగా యింటికి పారిపోవాలి. కుర్మాన్ దొంగ, చోర్. కుర్మాన్ పరపురుషుడు.

జుమ్మావార్‌నాడు పెళ్ళయింది. కాని ఏదీ? శనివారంనాడు తలాక్ తీసేసుకుని రాలేదు నూర్‌బాను.

తను అనుకున్నంతా అవుతోంది! ఒకసారి గుప్పిట్లో చిక్కిందంటే నూర్‌బానుని ఇంక విడిచి పెట్టడు ఉకిలద్దీ. పీక నొక్కినా సరే వాడు ఆ మూడక్షరాల మాటా మూడు సార్లు కక్కడు. చావొస్తేతప్ప ఇద్దర్నీ విడదీయలేరెవ్వరూ అంటాడు. సంగతి తెలుసుకోవాలని బయలుదేరాడు కుర్మాన్. బతిమాలుకుని యాచించేవాడిలా కాదు, హక్కుందని దబాయించి అడిగేవాడిలా వెళ్ళాడు.

ఉకిలద్దీ చెప్పాడు: "నా తప్పేంలేదు. పెళ్ళయితే అయింది. కాని నూర్‌బాను ఇంకా పెళ్ళాం కాలేదు. పెళ్ళాంలాగా నిక్కా సెయ్యనీకపోతే మరి తలాక్ ఎల్లా వీలవుతుంది?"

ఎంత దగా! ఎంత మోసం! అసలు వాడి ఉద్దేశం ఆమెని తన గుప్పిట్లోంచి వొవల కూడదనే! ఇంట్లో ఇరవై నాలుగ్గంటలూ బందీగా ఉంచేస్తాడు ఆమెని!

కుర్మాన్ పదిమంది పెద్దల్నీ కూడదీసి కూచోబెట్టాడు. తన ఫిర్యాదు వాళ్ళ ముందుంచాడు.

పిలవండి ఉకిలద్దీని అన్నారు. ఏమిటి అతని జవాబు? నూర్‌బానుని ఇంకా ఎందు కొదిలిపెట్టడంలేదు? తమ కిచ్చిన మాట ఎందుకు తప్పుతున్నాడు?

ఉకిలద్దీ వచ్చి చెప్పాడు : పెళ్ళి ఇంత వరకూ సార్థకం కాలేదు. పెళ్ళి ఫలితం దక్కలేదు. అంటే పెళ్ళి తంతు పూర్తి కాలేదు. బీళ్ళు దున్నారంతే. విత్తనాలు నాటలేదు. పెళ్ళయినాగానీ తప్పుకు తప్పుకు తిరుగుతోంది నూర్‌బాను. అసలు ముట్టుకో నియ్యడంలేదు. తలుపు గొళ్ళెం వేసుకుం టుంది. తన పడక గదికి రావడంలేదు. కల్మా చదివెయ్యగానే. అంతలోకే తలాక్ తెచ్చుకోగలననుకుంది కాబోలు! అందుకే కాబోలు కొయ్య దుంగలా ముఖం తిప్పేసు కుని కూచుంటుంది. ఇల్లాగే అయితే, కుట్టని ఆకు చింపెయ్యడం ఎల్లాగ?

నిజమేమరి! అంటూ తీర్పు చెప్పారు పెద్దలు పది మందీ. భర్తతో ఒక్క రాత్రేనా సంసారం చెయ్యకపోతే పెళ్ళి సాంతం అయినట్టు లెక్క కాదు. పెళ్ళి స్థిరపడకపోతే తలాక్ ఇవ్వడం కుదరదు. హలాల్ పూర్తి కాలేదు నూర్‌బానుకి.

ఇంక ఉపాయం లేదు వేరే. హలాల్ పాటించక తప్పదు నూర్‌బానుకి. బిక్షంలా యాచించవలసిందే తలాక్ కోసం.

గదిలో చేరి తలుపు గడియ వేసింది నూర్‌బాను. మర్నాడు పొద్దుటే పిట్టలు కూసే వేళకే ఉకిలద్దీ నూర్‌బానుకి తలాక్ పలికాడు మూడుసార్లు.

ఎండ మీదెక్కకముందే నూర్‌బాను వచ్చింది కుర్మాన్ ఇంటికి. గుమ్మంలో కూచుని వున్నాడు కుర్మాన్. చేతిలో హుక్కా వుంది కాని. అందులో నిప్పులేదు. ఎప్పుడారిపోయిందో అతనికే తెలీదు. దూరంలో ఎక్కడో చూపు! చూపులో జీవంలేదు. శూన్యంలోకి చూస్తున్నాడు. శరీరంలో కీళ్ళు వొదులై జారిపోయినట్టు నీరసంగా కూచున్నాడు. జీవితం మోడై పోయింది. నది పొంగివచ్చి గట్టునున్న ఇల్లు కూలదోసినట్టయింది బతుకు.

గుర్తుపట్టికూడా గుర్తుపట్టనట్టే చూశాడు ఆమెవంక. ఆమె కళ్ళకి నిన్నరాత్రి పట్టించిన సుర్మా. రాత్రి తాంబూలం ఎండిపోయిన ఎర్రడాగులు వొదలని పెదిమలు. శరీరం అంతా ఏదో సుఖానుభవ స్ఫూర్తి, అత్తరు వాసనలతో కలిసి వ్యాపించినట్లు. ఒంటిపైన నేరేడుపండు రంగు కొత్తచీర. చీర రెపరెపలతో ఏదో సుఖ సంతోషాల ఇంగిత స్వనాలు. జలధారలై జాలువారుతున్నట్టు.

ఈ జలాలు బురదమయమైన జలాలు. బురద అంటుకుంది. చెత్తమీద పారేసిన వాడిపోయిన దండ. శవం కుళ్ళిన వాసన.

ఆ నీళ్ళలో యింక స్నానం చెయ్యరాదు.

"ఇద్దత్ మూణ్నెల్లూ నే నిక్కడే వుంను. అదవగానే ముల్లాని పిలుసు కొచ్చి తొరతొరగా కలమా సదివేసియ్." అంటూ నూర్‌బాను ఇంట్లోకి అడుగెట్టబోయింది.

ఆరిపోయిన హుక్కా పీలుస్తూ పీలుస్తూ కుర్మాన్ అన్నాడు. "నేదు. నా కింక నిక్కా సేసుకోవాలని మనసు నేదు. నువ్వు మళ్లీ యెల్లిపో దఫాదార్ గాడింటికి."

